నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, మంగళవారం 22 ఏప్రిల్ 2025 RANGAREDDY

రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆంబోతుతండాలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ధాన్యం

ధాన్యం కొనుగోళ్లెక్కడ..?

విక్రయించేందుకు వడ్లు సిద్ధం.. అయినా ఇంకా ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

- రంగారెడ్డి జిల్లాలో 50%, వికారాబాద్ జిల్లాలో 80% వరకు కోతలు పూర్తి
- ఇంకా తెరుచుకోని కేంద్రాలు.. గింజనూ కొనని వైనం
- అకాల వర్షాలతో ఆందోళనలో అన్నదాత
- ఇప్పటికే వడగండ్ల వానతో నష్టపోయిన పలువురు రైతులు
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో.. తక్కువ ధరకే దళారులకు విక్రయిస్తూ నష్టపోతున్న వైనం
- రంగారెడ్డి జిల్లాలో ఈ యాసంగిలో 95,000 ఎకరాల్లో వరి పంట సాగు
- వికారాబాద్ జిల్లాలో 92,000 ఎకరాల్లో ..

వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలంలోని పుట్టపహాడ్ గ్రామంలో ఆరబోసిన ధాన్యం

కొనుగోలు కేంద్రాలు లేక.. మద్దతు ధర రాక అన్నదాత దళారుల చేతుల్లో దగా పడుతున్నాడు. రంగారెడ్డి జిల్లాలో 50%, వికారాబాద్ జిల్లాలో 80% వరకు వరి కోతలు పూర్తైనా ఇంకా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో.. ధాన్యాన్ని నిల్వ ఉంచుకోలేక తక్కువ ధరకే దళారులకు విక్రయిస్తూ నష్టాపోతున్నాడు. అకాల వర్షాలు.. ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వానల భయంతో రైతులు పంట పచ్చిగా ఉన్నా కోస్తున్నారు. ధాన్యాన్ని కల్లాలు, రోడ్లపై ఆరబోద్దామంటే ఎప్పుడు వాన వస్తుందోనన్న భయం అన్నదాతల్లో నెలకొన్నది.

-రంగారెడ్డి/వికారాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ)

ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తున్న రైతుకు నష్టాలే మిగులుతున్నాయి. ఓ వైపు ప్రభుత్వ నిర్లక్ష్యం.. మరోవైపు అకాల వర్షాలతో కన్నీళ్లే మిగులుతున్నాయి. బీఆర్ఎస్ హయాంలో ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా ప్రతి గ్రామంలోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు సేకరించగా.. కాంగ్రెస్ సర్కార్ మాత్రం రైతుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అన్యాయం చేస్తున్నది. గత కేసీఆర్ ప్రభుత్వం వరి కోతకు వచ్చిన సమయంలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా.. రేవంత్ సర్కార్ మాత్రం వరి కోతలు ప్రారంభమైనా ఇంకా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బంది పడడంతోపాటు నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చింది. ధాన్యాన్ని కల్లాలు, రోడ్లపై ఆరబెట్టి ప్రభుత్వం ఎప్పుడు కొంటుందా..? అని నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొన్నది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి తోడు గత మూడు, నాలుగు రోజులుగా జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తుండడంతో కల్లాలు, రోడ్లపై ఆరబెట్టిన వడ్లు తడిచిపోతున్నాయి. అటు ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలతో రైతులు అన్యాయమవుతున్నారు.

ఇంకా ప్రారంభం కాని కొనుగోళ్లు..

వికారాబాద్ జిల్లాలో యాసంగికి సంబంధించి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. జిల్లాలో వరి కోతలు 80 శాతానికి పైగా పూర్తైనా.. ప్రభుత్వం ధాన్యం సేకరణకు ఇంకా కేంద్రాలను ప్రారంభించనే లేదు. యాసంగిలో 92,000 ఎకరాల్లో వరి పంట సాగు కాగా, 2,25,000 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అదేవిధంగా ఈ యాసంగిలో రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించేందుకు జిల్లాలో 128 కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా సోమవారం బొంరాస్‌పేట మండలంలో ఆరు, దోమ మండలంలో ఒక కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ఆ కేంద్రాలను ప్రారంభించారే తప్ప రైతుల నుంచి ఒక గింజనూ కొనకపోవడం గమనార్హం. ఈ నెల మొదటి వారం నుంచే ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అధికారులు సమావేశాలు నిర్వహించినా.. కొనుగోళ్లలో మాత్రం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. అకాల వర్షాల భయంతో అన్నదాతలు తమ ధాన్యాన్ని తక్కువ ధరకే దళారులకు అమ్ముకుంటూ నష్టపోతున్నారు. గత మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కనీసం పెట్టిన పెట్టుబడైనా వస్తుం దో..? రాదోననే ఆందోళనలో రైతులు ఉన్నా రు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు త్వరగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరించాలని అన్నదాతలు కోరుతున్నారు. కాగా, జిల్లాలో 128 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అధికారులు నిర్ణయించగా.. వాటిలో ఐకేపీ ద్వారా 41 కేంద్రాలు, పీఏసీఎస్ ద్వారా 49, డీసీఎంఎస్ ద్వారా 38 ఏర్పాటు చేయనున్నారు. వీటిలో సన్నరకం వడ్లను సేకరించేందుకు 11 కేంద్రాలను ఏర్పా టు చేయనున్నారు. మద్దతు ధర ఏ గ్రేడ్ క్వింటాలుకు రూ. 2320, సాధారణ రకానికి రూ. 2300లుగా చెల్లించనున్నారు.

కల్లాలు, రోడ్లపైనే ధాన్యం..

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో గత వారం రోజులుగా ధాన్యం కల్లాల్లు, రోడ్ల పక్కన ఉన్నది. గత మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో ధాన్యం తడిచిపోయే ప్రమాదం ఉన్నది. ఎప్పుడు వాన వస్తుందోనన్న భయంతో ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. గత కేసీఆర్ ప్రభుత్వం వరి కోతలకు ముందుగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. కాంగ్రెస్ సర్కార్ మాత్రం ధాన్యం ఇండ్లకు చేరి 15-20 రోజులు దాటినా ఇంకా కేంద్రాలను ఏర్పా టే చేయలేదు. రైతన్నపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు. వెంటనే కొనగోలు కేంద్రాలను ప్రారంభించాలి.

-రాజశేఖర్‌గౌడ్,
మాజీ వైస్ ఎంపీపీ, కులకచర్ల

రంగారెడ్డి జిల్లాలో 95,000 ఎకరాల్లో పంటసాగు

రంగారెడ్డి జిల్లాలో ఈ యాసంగిలో సుమారు 95,000 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేయగా.. సుమారు 2,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇప్పటికే 50% వరకు కోతలు పూర్తైనా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే జిల్లాలో కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా షాద్‌నగర్ నియోజకవర్గంలో 3, ఆమనగల్లులో 1, ఏర్పాటుచేసి చేతులు దులుపుకొన్నారు. దీంతో గిట్టుబాటు ధర వస్తుందనుకున్న అన్నదాతకు తీవ్ర నిరాశే మిగిలింది. ఈ యాసంగిలో ఓ వైపు అనావృష్టి.. మరోవైపు అతివృష్టి రైతులను నిండా ముంచింది. తీసుకొచ్చిన అప్పులు కూడా తీరని పరిస్థితి నెలకొన్నది.

దళారుల ధర రూ.2 వేల లోపే..

గ్రామాల్లో దళారులు రైతుల నుంచి క్వింటాల్‌కు రూ.2,000 ధర మాత్రమే చెల్లించి ధాన్యాన్ని కొంటున్నారు. ఏకంగా రైతుల కల్లాల వద్దకే వెళ్లి సేకరిస్తున్నారు. ధాన్యం పచ్చిగా ఉందని, తాలు ఎక్కువగా ఉందని సాకుగా చూపించి క్వింటాకు రూ. 2,000 కంటే ఒక్క రూపాయా ఎక్కువ చెల్లించడంలేదు. కాగా, ప్రభుత్వం క్వింటాకు మద్దతు ధం రూ.2,320 నిర్ణయించింది. వ్యాపారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొంటూ రైస్‌మిల్లుల యజమానులకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో మంచాల, యాచారం, మాడ్గుల, ఆమనగల్లు, తలకొండపల్లి, షాద్‌నగర్, కొందుర్గు, కేశంపేట, షాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి తదితర ప్రాంతాల్లో జోరుగా వరి కోతలు సాగుతున్నాయి. ఇక్కడ 50% పైగానే కోతలు పూర్తైనా.. కొనుగోలు కేంద్రాలు మాత్రం ఇంకా ప్రారంభమే కాలేదు.

తూకాల్లో మోసాలు..

మధ్య దళారులు రైతుల వద్ద ధాన్యం కొనేందుకు ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లను ఉపయోగిస్తున్నారు. ఈ మిషన్ల ద్వారా సరిగ్గా తూకం రావడంలేదని రైతులు పేర్కొంటున్నా రు. క్వింటాల్‌కు నాలుగు నుంచి ఐదు కిలోల వరకు తగ్గడంతోపాటు తాలు పేరుతో మరింత తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్దతు ధర రాక తూకాల్లో జరుగుతున్న మోసాలతో రైతులు పెద్ద ఎత్తున నష్టాలకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

త్వరలో 26 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లాలోని రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు త్వరలోనే 26 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే షాద్‌నగర్, ఆమనగల్లు ప్రాంతాల్లో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశాం. మిగిలిన ప్రాంతాల్లోనే త్వరలోనే ఏర్పాటు చేస్తాం. ఐకేపీ, సహకార సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలనూ ప్రారంభిస్తున్నాం. ధాన్యం గ్రేడ్-1 క్వింటాల్‌కు రూ.2,320, గ్రేడ్-2,300లకు క్వింటాల్ చొప్పున మద్దతు ధర చెల్లించి కొంటాం.

-గోపీకృష్ణ, సివిల్ సప్లయ్ డీఎం, రంగారెడ్డి

ధాన్యం తడుస్తుందనే భయంగా ఉన్నది..

ధాన్యం చేతికొచ్చిన తర్వాత కూడా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం దారుణం. రోడ్లు, కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం అకాల వర్షాలతో తడుస్తుందనే భయం వెంటాడుతున్నది. అధికారులు స్పందించి త్వరగా కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనాలి.

-బోయిని మొగులయ్య, రైతు అంతారం, కులకచర్ల

కులకచర్ల : పీరంపల్లిలో..

నిరుద్యోగులకు అన్యాయం

రంగారెడ్డి జిల్లా విద్యాశాఖలో కొనసాగుతున్న అధికారిక ట్రాన్స్‌ఫర్లు

- వివిధ మార్గాల్లో జిల్లాకు బదిలీపై వస్తున్న టీచర్లు
- ఖాళీగా ఉండని పోస్టులు..కొత్త నియామకాలు నిల్
- కొత్తగా భార్యాభర్తల బదిలీల పేరుతో మరో 32 మందికి ఉత్తర్వులిచ్చిన ప్రభుత్వం

ఇప్పటికే కోటాను మించి వచ్చిన స్థానికేతరులు..

రంగారెడ్డి, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : జిల్లా విద్యాశాఖలోకి ఇతర జిల్లాల నుంచి వచ్చే ఉపాధ్యాయుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. జిల్లాకు చెందిన టీచర్లను జూనియర్ల పేరుతో ఇతర జిల్లాలకు పంపించడం.. అదేవిధంగా జిల్లాకు కొత్తగా వివిధ మార్గాల్లో వచ్చే వారితో స్థానిక నిరుద్యోగులకూ తీరని అన్యాయం జరుగుతున్నది. జిల్లాలో ఉద్యోగాలను సంపాదించేందుకు ఇతర జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి, మంత్రుల స్థాయిలోనే పైరవీలు చేస్తున్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పది మండలాలు రంగారెడ్డి జిల్లాలో విలీనయమ్యాయి. దీంతో జీవో 317 ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ వంటి జిల్లాల్లో సీనియర్లుగా ఉన్న ఉపాధ్యాయులంతా సీనియారిటీ ప్రకారం జిల్లాకు పెద్ద ఎత్తున బదిలీ చేయించుకున్నారు. మరోవైపు, భార్యాభర్తల బదిలీల పేరుతోనూ అధిక సంఖ్యలో పైరవీలు చేసుకుని జిల్లాకు వచ్చారు. దీంతో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు సుమారు వెయ్యిమంది వరకు జూనియర్ల పేరుతో వికారాబాద్ వంటి పలు జిల్లాలకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. దీంతో జిల్లాకు చెందిన ఉద్యోగులే జిల్లాలో పనిచేయని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై జిల్లా ఉద్యోగ సంఘాల నాయకులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితంలేదు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు స్పందించకపోతే జిల్లాకు తీరని అన్యాయం జరిగే అవకాశాలున్నాయి.

ఇతర జిల్లాల వారితో నిండిపోతున్న పోస్టులు

జిల్లాలోని ఉపాధ్యాయ పోస్టులన్నీ ఇతర జిల్లాల వారితోనే నిండిపోతున్నాయి. జిల్లాలో ఖాళీలు ఉండడకపోవడంతో స్థానిక నిరుద్యోగ యువతకు తీరని అన్యాయం జరుగుతున్నది. ఇప్పటికే జిల్లాలో 40 నుంచి 50 శాతం మంది ఇతర జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులే పనిచేస్తున్నారు. కోటాకు మించి స్థానికేతరులైన ఉపాధ్యాయులు జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరం తా జిల్లాల పునర్విభజన, భార్యాభర్తల బదిలీల ద్వారా జిల్లాలోకి వచ్చారు. దీంతో జిల్లాలో ఖాళీగా పోస్టులు లేకుండా పోతున్నాయి.

కొత్తగా భార్యాభర్తల బదిలీల పేరుతో 32 మంది ..

జిల్లాలో ఇప్పటికే కోటాకు మించి స్థానికేతరులు జిల్లాలో పని చేస్తున్నారని ఉపాధ్యాయ సంఘాలు మొత్తుకుంటున్నా.. వాటిని లెక్కచేయకుండా ప్రభుత్వం కొత్తగా మరో 32 మంది ఇతర జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులను భార్యాభర్తల బదిలీల పేరుతో జిల్లాకు ట్రాన్స్‌ఫర్ చేసింది. వారిలో 12 మంది స్కూల్ అసిస్టెంట్లు కాగా, 20 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులున్నారు. వీరి రాకతో జిల్లాలో స్థానికేతరుల సంఖ్య మరింత పెరిగింది.

ఇప్పటికే జిల్లాకు వందల సంఖ్యలో వచ్చారు..

స్థానికేతరులతో జిల్లాలోని నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతున్నది. భార్యాభర్తల బదిలీల పేరిట జిల్లాకు ఇతర జిల్లాల నుంచి 32 మందిని కేటాయిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేయడం దారుణం. ఇప్పటికే 317 జీవో ద్వారా వందల సంఖ్యలో ఇతర జిల్లాలకు చెందిన టీచర్లు వచ్చారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఇప్పటికే వేలాది రూపాయలు ఖర్చుపెట్టి స్థానిక నిరుద్యోగులు డీఈడీ, బీఈడీలు చేసినా ఉద్యోగాలు రాకపోవడంతో పొట్టకూటి కోసం చిన్నచిన్న ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుంటూ జీవితాన్ని వెళ్లదీస్తున్నారు.

-రాజిరెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

తొరుమామిడి వద్ద మొదళ్లకే నరికేసిన చెట్లు

కొమ్మలు అడ్డమొచ్చాయని..

చెట్లనే నరికేశారు..

హరితహారంలో నాటిన మొక్కలను మొదళ్ల వరకు తొలగించిన విద్యుత్ శాఖ సిబ్బంది

బంట్వారం, ఏప్రిల్ 21 : కోట్‌పల్లి, బంట్వారం మండలాల్లో విద్యుత్ శాఖ అధికారులు వింత పోకడలకు పోతున్నారు. వానకాలంలో చెట్లతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నదని చాలాచోట్ల చెట్లనే నరికివేస్తున్నారు. అయితే విద్యుత్ సరఫరాకు ఆటంకమైన చెట్ల కొమ్మలను నరకాల్సి ఉండగా.. ఏకంగా చెట్ల మొదళ్లనే నరుకుతుండడంతో పెద్ద పెద్ద చెట్లు నేలమట్టం అవుతున్నాయి. తిరిగి అవి పెరిగే అవకాశం లేకుండా పోతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు నేడు ఏపుగా పెరిగి రాకపోకలు సాగించే వారికి నీడను ఇస్తున్నాయి. ప్రధానంగా కోట్‌పల్లి-సదాశివపేట రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు, బంట్వారం మండలంలోని తొరుమామిడి-బంట్వారం రోడ్డులో ఉన్న చెట్లను మొదళ్లతో సహా మొత్తం నరికేశారు. అంతేకాకుండా ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న చెట్లనుకూడా నేలమట్టం చేశారు. దీంతో స్థానిక మాజీ సర్పంచ్‌లు, ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. హరితహారంలో మొక్కలు నాటేందుకు ఎంతో కష్టపడ్డామని.. ఇప్పుడు ఏపుగా పెరిగిన మొక్కలను మొదళ్లతో సహా ఎందుకు నరుకుతారని ప్రశ్నిస్తున్నారు. హరితహారంలో మొక్కలు నాటాలని అధికారులు చెప్పుతారు.. ఇప్పుడేమో విద్యుత్ శాఖ అధికారులు చెట్లను నరికి వేస్తారా.? ఇదేక్కడి విడ్డూరమంటూ మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, ఎల్లయ్యఅధికారులను ప్రశ్నించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయమైతే చెట్టుపై ఉన్న కొమ్మలనే తొలగించాల్సి ఉండగా చెట్ల మొదళ్లను తొలగిస్తే అవి మొత్తం చనిపోతాయని పేర్కొన్నారు.

ఏ చెట్లైనా నరకాల్సిందే..

విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా ఉండాలంటే చిన్న, పెద్దా అనే తేడా లేకుండా అన్ని చెట్లను నరకాల్సిందే. కొమ్మలను కాకుండా చెట్లను నరుకుతున్నాం. గాలి దుమారానికి చెట్లు విద్యుత్ వైర్లపై పడి ఏకంగా స్తంభాలే నేలపై పడిపోతున్నాయి. దీంతో చాలా గ్రామాలకు సరఫరా నిలిచిపోతున్నది. అందుకే ఏకంగా చెట్ల మొదళ్లకే నరకమని సిబ్బందికి చెప్పాం.

-రంగారెడ్డి ఏఈ, విద్యుత్ శాఖ, బంట్వారం

ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న చెట్లను నరుకుతున్న కూలీ

మద్దతుగా ఆటోడ్రైవర్ల ర్యాలీ..

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో తరలివెళ్లేందుకు రాష్ట్ర ఆటో యూనియన్ నాయకులు సమయాత్తమవుతున్నారు. కేసీఆర్ పాలన మళ్లీ రావాలంటూ నాచారంలో సోమవారం ఆటో డ్రైవర్లు భారీ ర్యాలీ తీశారు. 'కేసీఆర్ పాలన కావాలి.. కాంగ్రెస్ పాలన పోవాలి' అంటూ డ్రైవర్లు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ రాష్ట్ర ఆటోయూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య మాట్లాడుతూ.. చావడమే మీకు దిక్కు అనేలా కాంగ్రెస్ పార్టీ రాక్షస పాలన చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయాలతో ఆత్మహత్యలు చేసుకున్న ఒక్క ఆటో డ్రైవర్ కుటుంబాన్ని కూడా ఇప్పటివరకు ప్రభుత్వం ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఆటో జేఏసీ నాయకుడు శాతం రమేశ్ మాట్లాడుతూ.. బూటకపు హామీలిచ్చి డ్రైవర్లను అన్ని విధాలా రేవంత్ సర్కార్ మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో ఆటో జేఏసీ నాయకులు హయ్యద్ భాయ్, వెంకటేశ్, రమేశ్, కుమార్, అజార్, గోపాల్, ఎల్లయ్య, శ్రీనివాస్, రామాంజనేయులు, సాయికుమార్ పాల్గొన్నారు.

ఎలివేటెడ్ కారిడార్‌తో

ముప్పు

సిటీబ్యూరో : ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుపై స్థానికుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతున్నది. ఓవైపు ప్రాజెక్టు వెడల్పు తగ్గించి, పరిహారం పెంచాలని ఇప్పటికే జేబీఎస్-శామీర్‌పేట మార్గంలో నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ప్రాజెక్టుతో నివాస గృహాలు, మతపరమైన నిర్మాణాలకు నష్టం జరిగేలా ఉందని, ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను మార్చాలంటూ ప్యారడైజ్ నుంచి సుచిత్ర మార్గంలో ఉండే నివాసితులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు ప్రారంభానికి ముందే ఎన్నో చిక్కుముళ్లు పడుతుండడంతో.. ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుంది. ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను పునఃసమీక్షించి, అవసరమైతే మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. హెచ్ఎండీఏ చేపట్టిన ఈ ప్రాజెక్టుకు సీఎం రేవంత్‌రెడ్డి గతేడాది శంకుస్థాపన చేయగా... ఇప్పటికీ భూసేకరణ పూర్తి కాలేదు. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ మార్గంలో.. జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ మార్గంలో మెరుగైన రవాణాకు ఆస్కారం ఉండేలా 16 కిలోమీటర్ల నిర్మించేందుకు హెచ్ఎండీఏ ప్లాన్ చేసింది. ప్రాజెక్టు మొత్తం నివాస ప్రాంతాల మీదుగా పోతుండడంతో స్థిరాస్తులకు నష్టం కలుగుతుందని ప్యారడైజ్ నుంచి సుచిత్ర మార్గంలోని స్థానికులు వాపోతున్నారు. ఇక జేబీఎస్ నుంచి వెళ్లే లైన్‌లో ఇప్పటికే ప్రాజెక్టు వెడల్పును 200 ఫీట్ల నుంచి 150ఫీట్లకు తగ్గిస్తేనే భూములిస్తామని తేల్చి చెప్పడంతో ఇప్పటికీ భూసేకరణ పూర్తి కాలేదు. ఈ మార్గంలో తక్కువ నిర్మాణాలు ఉన్నాయని, ఆ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తే తక్కువ ఆస్తి నష్టంతో ప్రాజెక్టు సులభంగా ముందుకు సాగుతుందని చెబుతున్నారు.